బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే పల్లా

ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకపై ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలతో సమావేశమైన అనంతరం ప్రత్యేకంగా కేసీఆర్‌ను కలిసిన పల్లా జనగామ నియోజకవర్గంలోని అంశాలు, దేవాదుల నీటి విడుదలలో అధికారుల నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయిన అంశాలు, అసెంబ్లీలో లేవనెత్తిన ఇతర నియోజకవర్గ సమస్యలను కేసీఆర్‌కు వివరించారు.

నేడు మావోయిస్ట్ నేత రేణుక అంత్యక్రియలు

కడవెండిలో దహన సంస్కారాలకు ఏర్పాట్లు

గుమ్మడవెల్లి రేణుక(ఫైల్)

దేవరుప్పుల, ఏప్రిల్ 1: ఛత్తీగఢ్‌లోని దంతెవాడలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మండలంలోని కడవెండికి చెందిన మావోయిస్టు నేత గుమ్మడివల్లి రేణుక అలియాస్ చైతూ, అలియాస్ సరస్వతి మృతదేహం నేడు స్వగ్రామానికి చేరనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు రేణుక కుటుంబ సభ్యులు, బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కడవెండి మరోమారు ఎరుపెక్కనుంది. గుమ్మడవెల్లి రేణుక తాను నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాలుగా మావోయిస్ట్ పార్టీలో కొనసాగింది. విద్యాధికురాలైన రేణుక జర్నలిస్ట్‌గా, రచయితగా, ఓ సామాజిక కార్యకర్తగా సేవలందించారు. ఇదిలా ఉండగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతేవాడ జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం గుమ్మడవెల్లి రేణుక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని ఆమె సమీప బంధువులు కడవెండికి తరలిస్తున్నారు. మృతదేహం స్వగ్రామానికి అర్ధరాత్రి వరకు చేరుతుందని సమాచారం. బుధవారం ఉదయం జరిగే అంత్యక్రియల్లో పాల్గొనేందుకు అనేక మంది ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తారని రేణుక కుటుంబ సభ్యులు తెలిపారు.

రేణుకకు ప్రజాసంఘాల నాయకుల నివాళి

సామాన్యుల పక్షాన నిలిచి నేలకొరిగిన రేణుక అమరత్వం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ప్రజాసంఘాల నేతలు అన్నారు. మంగళవారం కడవెండికి వచ్చిన తెలంగాణ ఉద్యమ నేత గాదె ఇన్నయ్య ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన గుమ్మడవెల్లి రేణుక చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేర ప్రజల పక్షాన పోరాడుతున్న వారిని చంపడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి ఎన్‌కౌంటర్లకు స్వస్తి పలకాలన్నారు. రేణుక మరణం తీరని లోటని ఎంఎల్‌పీఐ(రెడ్ ఫ్లాగ్) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దొంతి రాజేశ్‌ఖన్నా అన్నారు. ఇదిలా ఉండగా ఉస్మానియా విద్యార్థి సంఘం నేత ఇప్ప పృథ్వీరెడ్డి మాట్లాడుతూగుమ్మడవెల్లి రేణుక అంత్యక్రియలకు ఆటంకాలు కలిగించొద్దని కోరారు. అంతిమసంస్కారాల్లో ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు నాయకులు పాల్గొనాలని కోరారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎన్‌కౌంటర్లను ఆపి మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు.

సంపుపై పడి ఒకరి మృతి

దొంగరి ఆశోక్ (ఫైల్)

పాలకుర్తి, ఏప్రిల్ 1: ప్రమాదవశాత్తు సంపు మీద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వావిలాలలో మంగళవారం జరిగింది. ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వావిలాలకు చెందిన దొంగరి ఆశోక్(42) వృత్తిరీత్యా ప్రైవేట్ లెక్చరర్. ఇతడు మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయమే ఇంట్లో ఉన్న సంపు మీద పడడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య హరిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూలం పవన్‌కుమార్ వివరించారు.

తొలిరోజు పాలకుర్తికే పరిమితం..

- నేడు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరితో ప్రారంభం
- జనగామలో ప్రొటోకాల్ మీమాంస..?
- నేడు కలెక్టరేట్‌లో లాంఛనంగా బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టనున్న కలెక్టర్?

జనగామ, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : 'పొద్దున తొమ్మిది గంటల నుంచే రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేయండి..ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొని కొందరికి పంపిణీ షురూ చేసిన గంట తర్వాత వద్దు..వద్దు వెంటనే పంపిణీ ఆపండి..అంటూ పై నుంచి మళ్లీ ఆదేశాలు..సన్న బియ్యం ఇవ్వకుంటే లబ్ధిదారులు లొల్లి (గొడవ) పెడుతున్నరు ఎట్లా సార్..? ఏం చేయమంటారు?..అని డీలర్లు గగ్గోలు పెడితే..ఏంలేదు పై నుంచి ఆదేశాలు వచ్చే వరకు షాపులు బంద్ చేసి వెంటనే బయటకు రండి'.. ఇదీ జనగామ జిల్లా కేంద్రంలో తొలిరోజు సన్న బియ్యం పంపిణీలో అధికారులు పడిన ప్రయాస. పౌరసరఫరాలశాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం..కీలకమైన సన్నబియ్యం పంపిణీ పర్యవేక్షించాల్సిన జిల్లా అధికారిణీ వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉండడం..ఆ తర్వాత స్థాయిలో ఉండే అధికారి..కింది నుంచి పైస్థాయి అధికారులకు సమాచారం అందించడంలో జరిగిన లోపంతో జనగామ పట్టణంలో మొదటిరోజు సన్నబియ్యం పంపిణీ ప్రారంభం అయినట్టే అయి.. కొందరితోనే ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సన్నబియ్యం పంపిణీ తొలి రోజు మంగళవారం ఒక్క పాలకుర్తి నియోజకవర్గానికే పరిమితమైంది. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని లింగాలఘనపురం, రఘునాథపల్లి మండలాల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా బుధవారం సన్న బియ్యం పంపిణీకి ముహూర్తం ఖరారైంది. అయితే జనగామ నియోజకర్గంలో మాత్రం ప్రొటోకాల్ పాటించే అంశంపై జిల్లా అధికార యంత్రాంగంలో మీమాంస నెలకొన్నది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఏప్రిల్ 1వ తేదీన సన్నబియ్యం పంపిణీ చేయాలన్నది ప్రభుత్వ ఆదేశం. ప్రస్తుతం జిల్లాలో 12 మండలాలు, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీలు ఉన్నాయి. 335 రేషన్ దుకాణా పరిధిలో 1,61,264 రేషన్‌కార్డుదారుల ద్వారా 4,95,294 మందికి సన్నబియ్యం అందించాల్సి ఉంది. ఈ లెక్కన జిల్లాలో ప్రతినెలా 3151 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం అవుతాయి..జిల్లాలోని గోదాముల నుంచి అన్ని రేషన్‌షాపులకు ఏప్రిల్ కోటాలో దాదాపు 80శాతం సన్నబియ్యం చేరాయి. అయితే తొలిరోజు కేవలం పాలకుర్తి నియోజకవర్గంలోని కొడకండ్ల మండలం ఏడునూతుల, పాలకుర్తి మండలంలోని శాతాపురం, దేవరుప్పుల మండలంలోని నీర్మాలలో ఎమ్మెల్యేలు యశ్వసినీరెడ్డి మాత్రమే ప్రారంభించారు. జనగామ నియోజకవర్గంలో సైతం ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే (పార్టీతో సంబంధం లేకుండా) సన్నబియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. కానీ అధికార కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూపుల మధ్య వర్గపోరు ఉండటం.. ఇక్కడ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండడంతో సన్నబియ్యం పంపిణీలో జిల్లా అధికారులకు ప్రభుత్వ పెద్దల నుంచి ఆయన లేకుండానే కార్యక్రమాలు చేయాలనే ఒత్తిడి పెరుగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదట్లోనే అధికారుల ప్రొటోకాల్ ఉల్లంఘనను స్థానిక ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో వ్యతిరేకించి అధికారిక సభా వేదికలపైనే ఉన్నతాధికారులను సైతం నిలదీశారు. వాస్తవానికి ఏప్రిల్ 1న(బుధవారం) కూడా అధికారికంగా సన్న బి య్యం పంపిణీ ఎమ్మెల్యే చేతుల మీదుగానే చేయించాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా మంగళవారం ఉదయం 9 గంటలకే జనగామ పట్టణ రేషన్ దుకాణాలు సహా నియోజకవర్గంలోని అన్ని షాపుల్లో లబ్దిదారులకు సన్నబియ్యం ఇవ్వాలని పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారుల నుంచి డీలర్లకు మౌఖిక ఆదేశాలు వచ్చాయి. దీంతో డీలర్లంతా పొద్దున్నే షాపులు తెరిచి యథావిధిగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొని లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ మొదలు పెట్టారు. ఏమైందో ఏమో తెలియదు కానీ కొద్ది మందికి సన్నబియ్యం పంపిణీ చేసిన తర్వాత బియ్యం ఇవ్వకండి..పంపిణీ నిలిపివేయండి..దుకాణాలకు తాళాలు వేయండి అంటూ అధికారుల నుంచి మళ్లీ ఫోన్లు రావడంతో డీలర్లు పంపిణీ ఆపేసారు.

నేడు కలెక్టరేట్‌లో లాంఛనంగా ప్రారంభం..?

సన్నబియ్యం పంపిణీ వివరాలు వెల్లడించే అంశంపై కలెక్టరేట్‌లో బుధవారం మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించే మీడియా సమావేశంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లతో కలిసి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొంటారని డీపీఆర్‌వో కార్యాలయం అధికారులు మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. అదే టైమ్‌లో స్థానిక ఎమ్మెల్యే లేకుండానే జనగామ నియోజకవర్గానికి సంబంధించి సన్న బియ్యం పంపిణీని జిల్లా కలెక్టర్ సమక్షంలో లాంఛనంగా ప్రారంభించేందుకు పౌరసరఫరాలశాఖ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కలెక్టరేట్‌లో కొందరు లబ్దిదారులకు సన్నబియ్యం ఇచ్చేందుకు వీలుగా రేషన్ డీలర్ల నుంచి పౌరసరఫరాలశాఖ అధికారులు బియ్యం బస్తాలు తెప్పించి సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

హెచ్‌సీయూ భూములను వేలం వేయొద్దు

- రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- జనగామలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన

జనగామలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 1 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో సీపీఎం శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నాయకులు ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు మాట్లాడుతూ హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం సరైంది కాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళన చేస్తుంటే పోలీసులు వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ, లాఠీచార్జి చేస్తున్నారని విమర్శించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థి నేతలపై కేసులుపెట్టి వేధింపులకు పాల్పడడం మానుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. హెచ్‌సీయూ భూములను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడిప్పుడే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజికవర్గాల విద్యార్థులు యూనివర్సిటీ విద్యను అభ్యసించడానికి వెళుతున్న క్రమంలో ప్రభుత్వ యూనివర్సిటీలను విధ్వంసం చేసి ప్రైవేట్ యూనివర్సిటీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదన్నారు. యూనివర్సిటీ భూముల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడే విధంగా ఉన్న జంతువులు, పక్షులు, నెమళ్లు, జింకలు, అరుదైన వృక్షాలను అంతం చేయాలని చూడడం సరైంది కాదన్నారు. ప్రకృతి–జీవ వైవిధ్యాన్ని అర్థం చేసుకోలేని ప్రభుత్వ దమనకాండను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం భూములు విక్రయించాలనే అనాలోచిత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి సోమయ్య, సింగారపు రమేశ్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, భూక్యా చందు, మునిగెల రమేశ్, సోమన్న, గణేశ్, మహేందర్, సారయ్య, లింగం, వెంకట మల్లయ్య, శ్రీకాంత్, కల్యాణి, ధర్మబిక్షం, సురేశ్ నాయక్, మదార్, నర్సింహస్వామి, లతా కుమారి, ఆనందం, బ్లెస్సింగ్‌టన్, సాయి ప్రసన్న, వెంకటాద్రి, సుధాకర్, శివలింగం, వెంకటేశ్, మునీర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకోం : బీఆర్ఎస్వీ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 1 : హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూముల జోలికొస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు బొంకూరి మహేశ్ హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూములను వేలం వేసి వాటిని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని కోరారు. యూనివర్సిటీ భూములను కాపాడాలనే లక్ష్యంతో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విపక్షాల నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేస్తూ అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులపై దమనకాండకు పాల్పడుతున్నారని మహేశ్ మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజా పాలన ఉండా లేక ప్రైవేట్ కార్పొరేటు పాలన కొనసాతుందా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలను దెబ్బతీసేలా కాంగ్రెస్ సర్కారు కుట్రలకు పాల్పడుతోందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థుల సమస్యలు పరిష్కరించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రి లేకపోవడం శోచనీయమని ఎద్దేవా చేశారు. పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పి ఆ భూముల జోలికి వెళ్లొద్దని సూచించారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీడి మోషి, చాగంటి రమేశ్, గుగ్గిల్ల ప్రదీప్, కలకోటి అఖిల్, బొంకురి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాదారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మహేందర్

ఏడునూతులలో ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కుమారస్వామి

ఉపాధిహామీ కూలీలకు వసతులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్

రఘునాథపల్లి ఏప్రిల్ 1: ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాపురం మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మాదారంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహేందర్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో నీలు, మంచినీరు, మెడికల్ కిట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కానీ పని ప్రదేశంలో పరిశీలిస్తే ఇవేమి కనిపించలేదన్నారు. దీంతో కూలీలకు ఎండలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన వివరించారు. పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే తాత్కాలిక ట్రీట్మెంట్ కోసం మెడికల్ కిట్ లేకపోవడంతో కూలీలకు సమస్యగా మారిందన్నారు. గత సంవత్సరం పని చేసిన కూలీ డబ్బులు నేటికీ కొన్ని గ్రామాల కూలీలకు రాలేదని మహేందర్ వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో వసతులు కల్పించడంతోపాటు కూలీలకు పనిదినాలు పెంచాలని కోరారు. లేకుంటే కూలీలను ఐక్యం చేసి ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూలీలు ఆరూరి వెంకటనర్సయ్య, యాకమ్మ, యాదగిరి, వరలక్ష్మి, మల్లయ్య, గజ్జల అశోక్, ఆరూరి యాదగిరి, గజ్జల భాస్కర్ పాల్గొన్నారు

జాబ్ కార్డుల్లో పనుల వివరాలు నమోదు చేయాలి

కొడకండ్ల : ఉపాధి హామీ పథకంలో చేసిన పనిని కూలీల జాబ్ కార్డుల్లో నమోదు చేయాలని ఐకేపీ ఏపీవో నరిగె కుమారస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ఏడునూతులలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన ఫార్మేషన్ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేసి ఫీల్డ్ అసిస్టెంట్ సమక్షంలో సూచనలు చేశారు. ఉపాధిహామీలో రోజుకు ఒక్కో కూలికి రూ.307 చెల్లిస్తారని తెలిపారు. పని చేసిన వివరాలను జాబ్ కార్డుల్లో నమోదు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆయన కోరారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఉపాధి హామీ పనులు చేపడుతున్న ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కన్సల్టెంట్ వాంకుడోత్ రమేశ్, సందెల వెంకన్న పాల్గొన్నారు.


ఏడునూతులలో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న యశస్వినీరెడ్డి

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి/కొడకండ్ల/దేవరుప్పుల, ఏప్రిల్ 1: పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మంగళవారం పాలకుర్తి మండలంలోని శాతాపురం, కొడకండ్ల మండలం ఏడునూతుల, దేవరుప్పుల మండలం నీర్మాలలోని రేషన్‌షాపుల్లో సన్న బియ్యం పథకాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దీనిని అమలు చేయాలని డీలర్లకు సూచించారు. సన్న బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఆవుల రాములు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, మాజీ సర్పంచ్ పసులాది వెంకటేశ్, లోనే శ్రీనివాస్ పాల్గొన్నారు. నీర్మాలలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లచ్చూనాయక్, ఎంఆర్ఐ రాజు, నాయకులు నల్ల శ్రీరాం, కాడబోయిన గణేశ్, ఇనుముల నాగరాజు, భూక్యా సజ్జన్, వడ్లకొండ తార, మాలతి, పులిగిల్ల వెంకన్న, రెడ్డిరాజుల రమేశ్ ఉన్నారు.

పోలీసుల అదుపులో సీపీఎం, ఎస్ఎఫ్ఐ నేతలు

ధర్మభిక్షంను అదుపులోకి తీసుకున్న పోలీసులు

జనగామ రూరల్, ఏప్రిల్ 1 : హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం విక్రయించేందుకు యత్నిస్తున్న నేపథ్యంలో దీనిని అడ్డుకుంటున్న విపక్ష పార్టీల నేతలను ముందస్తు అరెస్ట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం చలో హెచ్‌సీయు పిలుపునివ్వడంతో తెల్లవారుజాము నుంచే ఆయా సంఘాల నాయకులను అదుపులోకి తీసుకున్నారు. జనగామ మండలం అడవికేశ్వాపూర్ గ్రామంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ ధర్మభిక్షంను వారి వ్యవసాయ బావి వద్ద పనుల్లో ఉండగా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. మరిగడిలో సీపీఎం మండల కార్యదర్శి బోడ నరేందర్, గానుగుపహాడ్‌లో దడిగ సందీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరు ఎక్కడికి వెళ్లకుండా పోలీసులు నిర్బంధించి కాపలా కాశారు. ఈ సందర్భంగా సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ పోలీసులు ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా తమ పోరాటం ఆగదన్నారు. హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయాలు జరగనివ్వమన్నారు.

కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 1 : మండలంలోని ఇప్పగూడెంలో తెట్టకుంట కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు సంబంధిత అధికారులను కోరారు. మంగళవారం పలువురు విలేకరులతో మాట్లాడారు. 652 సర్వేనంబరులో 150 ఎకరాల భూమి ఉండగా, ఇందులో 40 ఎకరాల విస్తీర్ణం లో తెట్టకుంట ఉందన్నారు. దీని ఆధారంగా సుమారు 40 మంది రైతు కుటుంబాలు ఐదు దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుని జీవిస్తున్నారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇదే గ్రామానికి చెందిన కుందూరు నర్సింహారెడ్డి, బసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డీ ఇదే సర్వే నంబరులో తమ భూమి ఉందని చెబుతూ పది రోజుల నుంచి కట్టను తొలగించారని వివరించారు. ఈసారి కుంటలో నీరులేక పంటలు ఎండిపోతుంటే ఉపాధి హామీ పనులకు వెళ్తుండగా మంగళవారం వారు కట్టను ధ్వంసం చేసినట్లు గుర్తించినట్లు రైతులు వివరించారు. గతంలో 1982లో కొందరు తమకు ఇక్కడ భూమి ఉందని కట్టను ధ్వంసం చేయగా ఇది పంచరాయి భూమి అని ఆనాడు సర్వేయర్ చెప్పారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కుంట కట్టను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుని, కట్టను పునరుద్ధరించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో నౌండ్ల గట్టుమల్లు, బొంకూరి మల్లయ్య, బొంకూరి మహేశ్, బొంకూరి యాదగిరి, పాల భిక్షపతి, గద్దల గట్టుమల్లు, గుండె లక్ష్మి, గుండె అనిల్, గుండె అశోక్, నౌండ్ల ప్రశాంత్, నౌండ్ల మల్లాకి, నౌండ్ల కిరణ్, నౌండ్ల ఏలియా తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకం

★హన్మకొండ సమీపంలోని యాదవనగర్ పెట్రోల్ పంప్ రెడ్డిపురం ప్రాంతంలో సాయికృపా కాలనీలో రెండు కొత్త తూర్పు ముఖంగా187 గజాల ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మకానికి ఉన్నాయి. Cont: VRN Developers & Builders-9700101918.
NTW-332491

PLOT FOR SALE

★వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

WANTED

jobs Apply Now!

★మా వద్ద పనిచేయుటకు స్త్రీ, పురుషులు (6) గురు కావలెను. వయస్సు: 30 సం॥ల లోపువారు. ఉచిత వసతి, జీతం : 10,000/- నుండి 15,000/- వరకు. సెల్: 9849316058, వరంగల్.
NTW-336919

TOURS & TRAVELS

★16/04/25 అయోధ్య, కాశీ, నేపాల్, ముక్తినాథ్ యాత్ర & 09/05/25 సరస్వతీ పుష్కరాలు, చార్‌ధామ్ యాత్ర. రై+బ+భో+వ. భాగ్యలక్ష్మి టూర్స్. Ph: 9397617094.
NT-1899

మహిళ లకు శుభవార్త

★శ్రీ శైలి బ్యూటీ పార్లర్‌లో ఫ్రీ బ్యూటీషియన్ కోర్సు గవర్నమెంట్ సర్టిఫికెట్‌తో నేర్పించబడును. టైలరింగ్, మగ్గం వర్క్, మెహిందీ 5 వేలకే With సర్టిఫికెట్‌తో నేర్పబడును. సెల్: 9989060668
NTW-336920

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది